కథానిక

తేలని ప్రశ్న

శ్రీ సాయినాథశాస్త్రి

శేఖరంగారప్పుడే అన్నంతిని కూర్చుని పేపరు చదువుతున్నారు. ఇంతలో పోష్టుజవాను ఉత్తరం తెచ్చిచ్చాడు. చదువుతున్నారు. ఏముందీ — రామం అంటే శేఖరంగారి పెద్దకొడుకు. మేనత్త కూతుర్ని పెళ్లి చేసుకోటానికి ఒప్పుకున్నానని తండ్రికి రాశాడు. ఇది చదువుకుని శేఖరంగారు ఉబ్బి తబ్బిబ్బయ్యారు. భార్య సరోజినికి చెప్పాలిది. సరోజిని కంతగా యిష్టంలేదు. కొడుకు డాక్టరు — కట్నం బాగా రావాలని. ఎట్లాలేదన్నా వో పాతిక వేలన్నా లాగాలని ఆశ. మేనరికం చేసుకుంటే పాతిక వేలుం కాదుగదా, కనీసం పాతిక వందలన్నా ముట్టవు. అట్లాగని మరీ యిష్టం లేకనూపోలేదు. ఆడబిడ్డకి తనంటే మొదట్నుంచీ మహాప్రేమ. అమ్మాయి కూడా బుద్ధిమంతురాలూ, పనిమంతురాలూను, అందచందాలకి లోటులేదు. కొడుకే మంటాడో రాని కనుక్కోమని భర్తతో చెప్పి రాయించింది సరోజిని. దానికే యిది సమాధానం.

ఆ వుత్తరాన్ని చదువుతుంటే శేఖరంగారికి తన పూర్వజీవితం కళ్లల్లో మెదిలింది. వెంటనే లేచెళ్ళి, పెట్టిలోంచీ వో పాతబడిపోయిన కాగితాన్ని చేత్తో పుచ్చుకుని కుర్చీలో కూర్చుని కళ్లు మూసుకున్నారు — జరిగిన సంఘటలన్నీ వరసాగ్గా గుర్తొస్తున్నై —

◆ ◆ ◆

రామారావుగారు వాళ్ళనాన్న పోయేటప్పటికి స్కూలుఫైనలు చదువుతున్నారు. వాళ్ళనాన్నకు కొడుకే కలక్టరో అవ్వాలని మహాఆశగా వుండేది. కానీ పాపం ఏం చేస్తారు! ఆశ ఆశగా వుండగానే బాల్చీ తన్నేశారు. అప్పటికి రామారావు వయస్సు 18 ఏళ్లు. అప్పట్నుంచీ బడికి ఎగనామం పెట్టేశాడు. తల్లి కూడా ఎక్కువగా బలవంతపెట్టలేదు. చిన్నప్పట్నుంచీ పొలంపనులంటే సరదా కావటం మూలాన సొంతంగా వ్యవసాయం సాగించాడు. ఆ యేడాది రెండు పుట్ల గింజలు లాభం వొచ్చినై. తల్లి కూడా కొడుకు ప్రయోజకుడైనందుకు చాలా సంతోషించింది.

రామారావుగారి నాన్న బ్రతికుండగానే రామారావుకి పిల్లనిస్తామని రామారావుగారి మేనత్త కబురు చేసింది. రామారావు నాన్న తనకొడుకు కనీసం ఏ బియ్యేనో అయింతరవాత తప్పక చేసుకుంటానని హామీ యిచ్చాడు. ఇంతలో అనుకోకుండా యిట్లా జరిగింది. రామారావుగారి తల్లి ఆడబిడ్డగారింటికెళ్ళింది. చూడ్డానికెళ్ళిందే మోనసి వూరుకున్నాడు కొడుకు. పొలం దున్నుకునే పల్లెటూరి మొద్దుకి మా అమ్మాయి నివ్వమని ఖచ్చితంగా చెప్పేశారు వాళ్లు. తలవొంచుకుని తిరిగొచ్చేసింది. రామారావుగారి కిది తెలిసింది. వాళ్ళిట్లా అంటారని తాను ముందే వూహించుకున్నాడు. పోనీలెమ్మని వూరుకున్నాడు. తత్పర్యవసానంగా మూడు నెలల్లో రామారావుగారికీ, ఆ వూళ్ళోనేవున్న ఒక సామాన్యపు రైతు కూతురికీ పెళ్లి జరిగిపోయింది. దీనివల్ల రామారావుకి ఏం నష్టం కలగలేదు సరిగదా లాభించిందనే చెప్పాలి. అట్లా భార్య రావటం ఏమిటీ యిట్లా వ్యవసాయం గూడా మూడు పువ్వులూ, ఆరు కాయలుగా పెరిగిపోయింది. ఏడాది తిరిగేటప్పటికి ఒక కొడుకు గూడా పుట్టాడు. అతగాడి పేరే శేఖరం! తనకి ఎట్లాగూ చదువుకునే యోగం లేకపోయిందని, కొడుకుని జాగ్రత్తగా చదివించారు రామారావుగారు. తత్ఫలితంగా శేఖరం, ఎమ్.ఏ. ప్యాసయ్యాడు.

ఇప్పుడు మళ్లా వీళ్ళతో సంబంధబాంధవ్యాలు కలుపుకోవాలని ఆ రామారావుగారి మేనత్తా వాళ్ళే వుబలాటపడుతున్నారు. తమ అబ్బాయి సుందర రామయ్య కూతురు రమని శేఖరానికి చేసుకోమంటున్నారు. శేఖరానికి పాతవిషయాలన్నీ తెలుసు. యింకా గుర్తున్నై. కానీ రామారావుగారు అవన్నీ మరిచేపోయి అబ్బాయి కిష్టమైతే తమ అభ్యంతరం ఏమీలేదని చెప్పారు.

అక్కణ్ణుంచీ శేఖరం వెంటపడి వేధించటం మొదలు పెట్టారు. శేఖరం కోసమే రమ పుట్టిందట! శేఖరం, రమలు యీడూ జోడూ కూడా బాగుంటుందిట! శేఖరం ససేమిరా చేసుకోనన్నాడు. కట్నం ఆశ పెట్టారు. ఊహుఁ! శేఖరం వినలేదు. శేఖరానికి తెలిసిన

ప్రతివాడిచేతా చెప్పించారు రమని పెళ్ళి చేసుకోమని. శేఖరంకి ప్రాణం విసిగిపోయింది. తనతో యిక ఆ విషయం ప్రస్తావించొద్దని శేఖరం ఖచ్చితంగా నిర్మొగమాటంగా చెప్పేశాడు. అది మొదలూ శేఖరాన్ని తిట్టిపొయ్యటం మొదలెట్టారు. కనిపించిన ప్రతివాడితోనూ శేఖరాన్ని గురించి చెడ్డగా ప్రచారం చెయ్యటం సాగించారు. చివరకు వొక రోజున ప్రత్యేకం పనిగట్టుకుని వచ్చి "ఏదో కావాల్సినవాడివి గదా అని చేసుకోమన్నాం! అంతేగానీ నీ అందచందాలూ, గుణగణాలూ చూసికాదు. ఇంతటి సంబంధం దొరక్క కాదు. దీనితల్లో శేజెమ్మలాంటి సంబంధం తెస్తా చూసుకో"మంటూ వెళ్ళిపోయారు.

దాంతో వాళ్ళకీ, వీళ్ళకీ మధ్య రాకపోకలు ఆగిపోయినై. రామారావుగారితో ఎవ్వరూ మాట్లాడేవాళ్ళు కాదు, యింటికెప్పుడూ వచ్చేవాళ్ళూ గాదు. రామారావుగారే ఎప్పుడన్నా వెళ్ళి చూసి వస్తూండేవారు. శేఖరం వుద్యోగ ప్రయత్నాలు చేశాడు. హైదరాబాద్‌లో వుద్యోగం వచ్చింది. వెళ్ళి జాయినైనాడు. రామారావుగారే ఎప్పుడన్నా వెళ్ళి కొడుకుని చూసి వస్తూండేవారు. శేఖరం దసరా శెలవలకి యింటికొచ్చాడు. శేఖరం వచ్చిన కొద్దిరోజులకే ఎవరో పిల్లనిస్తామని వచ్చారు. అంతా వెళ్ళారు పెళ్ళికూతుర్ని చూసేందుకు. అందరికీ నచ్చింది. వెంటనే లగ్గాలు కూడా పెట్టుకున్నారు. రామారావుగారు అందరికీ శుభలేఖలు అచ్చుకొట్టించి పంపించారు. శుభలేఖలు ప్రత్యేకం శేఖరం పట్టుకెళ్ళాడు రమా వాళ్ళింటికి. ఇంటికొచ్చినవాణ్ణి కనీసం పలకరించనన్నా, పలకరించలేదు. పోనీ తమ్మని వూరుకున్నాడు శేఖరం. మాట్లాడకుండానే శుభలేఖలు చేతికిచ్చాడు. విసిరి పారేశారు. చీకటిలో పోదామని ఆరోజుకక్కడే వుండిపోయాడు.

సాయంకాలమైంది. అట్లా పొలాలకేసి బయల్దేరాడు శేఖరం. ఒక్కటే ఆలోచనలు — "ఏమిటిది? ఎందుకింత కక్ష? మా నాన్నకి చేసిన అవమానం మరిచిపోయారుగామాల్లు. మా నాన్నకి చదువేం లేదనేగా అట్లాచేశారు, మొదట పిల్లనిస్తామని. మా నాన్నే పనికిరానప్పుడు నేను మాత్రం ఆ తండ్రి కొడుకునిగానూ? నేనెట్లా పనికొస్తానో వాళ్ళతో సంబంధ కలుపుకోటానికి!" అని ఆలోచిస్తూ తిరిగి తిరిగొచ్చాడు, ఇంటికొచ్చేటప్పటికి చీకటి పడుతోంది. ఇంట్లో ఎవరూ వున్నట్టులేదు. చెప్పులు

వరండాలో విడిచి, దొడ్లోకెళ్ళి కాళ్ళు కడుక్కొచ్చి కూర్చున్నాడు ఆలోచిస్తూనే.

ఇంతలోనే రమ వచ్చింది. పేరంటానికి వెళ్ళింపల్లే వుంది — కాళ్ళకు పసుపు రాచుకుంది. చేతిలో అరిటిపళ్ళూ అవీ వున్నై. ఒస్తూనే — "ఎంతసేపైంది బావా నువ్వొచ్చి? అమ్మా, నేను పేరంటానికెళ్ళాం! నాన్నేదో పనుందని ప్రక్కవూరి కెళ్ళారు. దా లోపలికి" అంటూ లోపలికెళ్ళి దీపం వెలిగించి మంచం వాల్చింది. శేఖరం మాట్లాళ్ళేదు.

"ఇట్లా వచ్చి మంచంమీద కూర్చో బావా!" అంది రమ.

"ఎందుకులే రమా! ఫరవాలేదు. ఎక్కడైతే యేంలే!" అన్నాడు.

"కోపం వచ్చిందా బావా?"

"ఎందుక్కోపం?"

"మా అమ్మా, నాన్నా పలకరించలేదని."

"అబ్బే? కోపమెందుకూ? పోస్టులో పంపిస్తే సరిపోయే. కానీ, నేనే పట్టుకొస్తే ఎట్లా వుంటుందోనని వచ్చాను. తెలిసుండే వచ్చినప్పుడు యింకా కోపం దేనికి?" అన్నాడు కాసేపు మెదలకుండా వూరుకున్నారు.

ఉన్నట్టుండి చటుక్కున "బావా! నేనొకటడుగుతాను నిజం చెబుతావా?" అంది రమ.

"ఆఁ!" అన్నాడు శేఖరం.

"నన్ను చేసుకోటానికి నీకేమిటభ్యంతరం? నేను బాగుండకనా? చదువు లేదనా? నీ అంతస్తుకి తగననా? లేక కట్నం చాలకనా? ఎందుకని చేసుకోనన్నావు?" అని సూటిగా అడిగింది రమ.

శేఖర్ ఒక్కక్షణం రమవంక చూశాడు. "కూర్చో రమా! నీతో చాలా విషయాలు చెప్పాలి" అన్నాడు శేఖరం. రమ స్తంభానికానుకుని కూర్చుంది చెప్పమన్నట్టుగా. శేఖరం తన తండ్రి పెళ్ళికి జరిగిన విశేషాలన్నీ విడమరిచి చెప్పాడు దాచకుండా. చెప్పి "ఇది రమా! అసలు విషయం. ఏం? మా నాన్నని అవమానిస్తే నన్నవమానించినట్టు గాదూ? మేమూ మీలాంటి మనుష్యులమే. మాకూ మానాభిమానాలూ, గౌరవ మర్యాదలూ వున్నై" అంటూ వుద్రేకంగా అన్నాడు శేఖరం. వెంటనే రమవంక చూశాడు పరీక్షగా. రమ తలవంచుకుని వింటోందనుకున్నాడు యింతసేపూ. కాదు ఏడు

స్తోందని గ్రహించాడు శేఖరం. మెదలకుండా వూరుకున్నాడు. రమ కాసేపాగి కళ్లుతుడుకుని –

"బావా! ఒకళ్లు చేసిన తప్పుకి మరొకళ్ళకి శిక్ష వెయ్యటం న్యాయమేనా? మా పెద్దవాళ్లు ఏదో చేశారని నన్ను యిట్లా బాధించటం బాగా వుందికదూ? అట్లా అని నిన్ను ఆత్మాభిమానం చంపుకోమనటంలేదు? మా వాళ్లు చేసింది తప్పు కాదని సమర్థించబోవటంలేదు కూడాను. నీ యిష్టం! కానీ చిన్నప్పట్నుంచీ నిమీద పెట్టుకున్న ఆశలు ఒక్కసారిగా వదల్లేకుండా వున్నాను. ఏశవో చెప్పి నిన్ను కష్టపెట్టదల్చుకోలేదు. ఇక నా అదృష్టంలో ఎల్లా రాసిపెట్టుంటే అట్లా జరుగుతుంది" అంది రమ.

శేఖరం నిశ్చేష్టుడైపోయాడు. "రమ తనను భర్తగా వూహించుకుందా! కలలోగూడా తానూహించలేకపోయాడు. రమ నాటకమాడుతుందేమో? వాళ్ల నాన్నా, అమ్మా యిట్లా అనమన్నారేమో? ఛ! ఛ! రమ అల్లాంటిది కాదు. రమ చెప్పిన మాటలు సబబుగానే వున్నై. కానీ ఏం చెయ్యటం? రమ అందంగా లేదనా తను చేసుకోంది? తన తండ్రికి జరిగిన పరాభవానికి తగినట్లు తను ప్రవర్తించ దలుచుకున్నాడు. ఏమైనా సరే! లాభం లేదిహ!" అని అనుకుంటున్నాడు శేఖరం.

శేఖరం ఆలోచనలన్నీ పసిగట్టిన రమ – "ఇంత వొచ్చింతరవాత యింకా ఆలోచన దేనికి? ఇప్పుడు నన్ను నువ్వు చేసుకుంటాననా, నేను నిన్ను చేసుకోను. నేను నిన్ను చేసుకుంటే నీవు నిశ్చయం చేసిన ఆ పిల్ల గతేమాతుంది? కాబట్టి హాయిగా పెళ్లి చేసుకో. నా జన్మకింతే" అంటూ గభాలున లోపలికి వెళ్లిపోయింది. కాసేపాగి శేఖరం గూడా లోపలికెళ్లాడు. చూస్తే మంచంమీద రమ పడుకుని ఏడుస్తోంది. శేఖరం కాసేపు ఆలోచించి, మంచం దగ్గిరికెళ్లి "రమా!" అని పిలిచాడు. రమ మాట్లాడేదు. శేఖరం రమ చెయ్యి పట్టుకుని లేవదీస్తూ "ఛ! ఛ! ఏమిటిది రమా! ఏడవకు. నా తెలివి తక్కువతనం యిదంతా! నువ్వంటే నాకేం కోపం లేదు. నామీద అభిమానం అంటూ మీ వాళ్ళల్లో ఎవరికైనా వుంటే – అది నీకేనన్న సంగతి నాకు తెలుసు. దూరమాలోచించకుండా చేశానీ పని – నువ్వంటే నాకేం అయిష్టతలేదు. రమా! ఊరుకో! ఏడవకు మరి. ఏడిస్తే నామీద." అని ఏమో అనబోతున్నాడు శేఖరం.

"రమ చటుక్కున శేఖరం నోరు తనచేత్తో మూసి "అంత మాటనకు బావా! ఏడుపు ముంచుకొచ్చింది. ఆపుకోలేకపోయాను. నా వస్తువు నెవరో బలవంతంగా లాక్కుంటున్నట్టనిపించింది" అంది రమ శేఖరం గుండెలమీద తలపెట్టి ఎక్కెక్కి ఏడుస్తూ.

శేఖరం ఒక్కసారిగా రమని గుండెల కదుముకున్నాడు. రమ కూడా శేఖరాన్ని హత్తుకుంది గాఢంగా. ఇంతలో బయట ఎవరో 'ఏమండీ!' అని పిలిచారు. రమ వదిలి, వదిలించుకుని గభాలున పరిగెత్తింది బైటికి. శేఖరం దూరంగా తొలగిపోయాడు.

మర్నాడుదయం చీకటితో బయల్దేరాడు రైలుకి. ఎవ్వరూ ఏం మాట్లాళ్ళేదు. రమ తను చేసినపనికి మనసుకుందోనని శేఖరం కించపడ్డాడు. వెళ్తూ అందరితోనూ చెప్పి, రమతో గూడా చెప్పటానికి ఆమె గదిలో కెళ్లాడు. రమ కిటికీవైపు తిరిగి కూర్చునుంది. "రమా! వెళ్తొస్తా!" నన్నాడు. రమ యిటువైపుకి తిరిగింది. కళ్ళవెంట నీళ్లు కారుతున్నై. శేఖరం "నన్ను క్షమించు రమా!" అన్నాడు మళ్లా.

"అంత మాటెందుకు బావా! వెళ్ళిరా! నా హృదయంలోనుంచి మాత్రం వెళ్ళలేవుగా! మళ్లా ఎప్పుడు కనిపిస్తావో" అంది దుఃఖంతో.

శేఖరం మౌనంగా నిట్టూరుస్తూ వచ్చేశాడు. స్టేషనుకొచ్చి, టిక్కెట్టు కొందామని పర్సు తీశాడు. ఏదో రంగు కాగితం కనిపించింది నోట్ల మధ్యన. టిక్కెట్టు తీసుకుని త్వరత్వరగా కదలబోయే బండిలో ఎక్కేశా. బండి బయల్దేరింది. కూర్చుని స్థిమితంగా పర్సులో కాగితం బయటికి తీసి విప్పాడు. అది రమ రాసిన వుత్తరం –

"బావా!

నీ నుంచీ నేనేం కోరను. అసలు నాకు నిన్నట్నుంచీ దేనిమీదా కోరికలేదు. నిన్ననే నాకు పరిపూర్ణమైన ప్రేమంటే యేమిటో తెలిసింది. నా జీవితానికది చాలు. నా అదృష్టం బాగావుంటే జీవించినంతకాలం అలానే గడిపేదాన్నేమో! నాకా అదృష్టంలేదు. అందుకు నువ్వు బాధ్యుడివి కావు, బాధపడకు. తప్పక నిన్ను మళ్ళా చూడగలననే ధైర్యంతో వున్న

నీ
"రమ"

శేఖరానికి ఒక్కసారిగా గుండెలు పిండేసినట్టయింది, బాధగా చూచాడా వూరివైపు. అది ఎప్పుడో దాటిపోయింది కానీ, రమ యింకా కళ్ళ ముందరే నిలిచిపోయింది.

ఇంటి కొచ్చేశాడు శేఖరం. తరువాత కొద్ది రోజుల్లోనే సరోజినితో పెళ్ళి జరిగింది. శేఖరం భార్యని తీసుకుని హైద్రాబాద్ వెళ్ళిపోయాడు. ఐదారు సంవత్సరాలు సుఖంగా గడిచిపోయినై సరోజినికి. ముగ్గురు పిల్లలు గూడా కలిగారు. పెద్ద పిల్లపేరు రమ, రెండోవాడు రామం, మూడోవాడు రఘు. మొదట్లో శేఖరం కొంచెం బాధగానే గడిపేవాడు. కాని కాలం గడిచినకొద్దీ రమను పూర్తిగా మరిచిపోలేదుగానీ అంతగా బాధపడటంలేదు. రమ పెళ్ళి చేసుకోలేదని, ఆ వూళ్ళోనే పంతులమ్మగా చేరిందని తెలిసింది. అంతే. మళ్ళీ కబుర్లేం తెలియటం లేదు.

హఠాత్తుగా ఒకరోజున టెలిగ్రాం వచ్చింది — "రమకు జబ్బుగా వుందని, వెంటనే రావాలని" శేఖరం వున్నవాడున్నట్టుగా బయల్దేరి వెళ్ళాడు. శేఖరం వెళ్ళేటప్పటికి రమకి స్పృహలేదు. నెల రోజుల్నుంచీ జ్వరం వస్తోందిట. డాక్టరు యిక లాభం లేదన్నాడుట. శేఖరానికి గుండెల్లో బాధ పైకెగతన్నింది. మంచంమీద కూర్చుని రమ వంకే చూస్తున్నాడు. ఎవరొచ్చి పోతున్నదీ కూడా చూడటంలేదు.

రమకు కొంచెం స్పృహ వచ్చింది. కళ్ళుతెరిచి చూసింది. ఎదురుగా శేఖరం కనిపించాడు. రమ సంతోషంలో చూసింది. చేతులు చాచి "బావా! వెళ్తున్నా! మరచిపోవు కదూ! ఒక్కసారి కౌగలించుకోవూ" అంది వుత్సాహంగా. శేఖరం రమను కౌగలించుకున్నాడు. రమ "బావా! వెళ్తున్నా!" నంది. అంతే! శేఖరం రమ వంక చూశాడు. అంతా అయిపోయింది. శేఖరం వెఱ్ఱిగా ఆమె వంకే చూస్తున్నాడు. ఎవరో వచ్చి శేఖరాన్ని వదిలించి దూరంగా తీసికెళ్ళారు. శేఖరానికేం జరుగుతున్నదీ తెలియటంలేదు. జీవచ్ఛవంలాగా వున్నాడు. ఎక్కడ చూసినా రమే కనపడుతోంది. ఎవరు మాట్లాడుతున్నా రమేమోనని చూసేవాడు. చివరికి రెండు నెలలకిగానీ మామూలు మనిషి కాలేదు.

♦ ♦ ♦

శేఖరం ఇట్లా ఆలోచిస్తూనే వున్నాడు. కళ్ళల్లోంచి రెండు కన్నీటిబొట్లు కిందపడ్డాయి. ఇప్పుడు తను ముసలివాడవుతున్నాడు. ఉద్యోగంలోంచీ రిటైరైనాడు. ఇంటిపట్టునే వుంటున్నాడు. ఇప్పుడా రమా లేదు, తను ఆ శేఖరమూ కాదు. తనలో వుండే పట్టుదలలన్నీ వదలిపోయినై. తన కొడుకు మేనరికం చేసుకుంటానికొప్పుకోని మంచిపనే చేశాడు. రమ రాసిన వుత్తరాన్ని పెట్టెలో దాచి, సరోజినితో కొడుకు పెళ్ళికిష్టపడ్డాడని చెప్దామని యింట్లో కెళ్ళాడు. ఎప్పట్నుంచో శేఖరంగారి మనస్సులో ఒకేఒక ప్రశ్న మనస్సులో వేధిస్తోంది — తను చేసింది తప్పేనా? అని. ఏమో మరి—

కడుపు నొప్పి, నోట నీరూరుట, త్రేపులు, వాంతులు, మలబద్ధకము లాంటి అజీర్ణ లక్షణములకు
కేసరి గారి
ఆదిత్య లవణము
దివ్య ఔషధము
వెల రు. 1-75 న.పై.
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 14.

ఏజంట్లు కావాలి!
హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, బెంగుళూరు మున్నగు మా ఏజంట్లులేని నగరాలలో మా గృహలక్ష్మి మాసపత్రికను స్వంతబాధ్యతపై విక్రయించుకొనుటకు న్యూస్ పేండర్లు కావలెను!
వివరములకు వ్రాయండి!
మేనేజరు, గృహలక్ష్మి కార్యాలయము,
మద్రాసు — 14.